క్లుప్తంగా

క్రీడలకు అధిక ప్రాధాన్యత



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలతో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తుందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్ర పోటీలను ఈ నెల 26 న గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని లయోలా స్కూల్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభోత్సవం చేయనున్న సందర్భంగా శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ కీర్తి చేకూరి, కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి ఆడుదాం ఆంధ్ర ద్వారా క్రీడలలో ప్రతిభావంతులను గుర్తించి తగిన ప్రోత్సాహం ఇవ్వనున్నారన్నారు. ఆడుదాం ఆంధ్రలో భాగంగా గుంటూరు నగరంలోని 206 సచివాలయాల పరిధిలో 40 వేల మందికి పైగా పోటీలలో పాల్గొనే అవకాశం ఉందని, క్రీడా పోటీలకు అనుగుణంగా నగరంలో 19 గ్రౌండ్‌లను సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం పోటీల బ్రోచర్స్‌ను ఆవిష్కరించి కిట్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, డి.యస్.డి.ఓ వెంకటేశ్వర రావు, కార్పొరేటర్లు, శాప్, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా మేరీ సరోజినీ

గుంటూరు మెడికల్: న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యురాలుగా గుంటూరుకు చెందిన బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ కత్తి మేరి సరోజనిని నియమించారు. తనను రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా నియమించినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రయాణికుల సమస్యలను రైల్వే అధికారులకు దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పట్నంబజారు: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఒకటో డివిజన్ తారకరామానగర్, 3వ డివిజన్ రాజీవ్‌గృహకల్ప రోడ్డులో శుక్రవారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం జరిగింది. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొ రేటర్లు కామిరెడ్డి రంగారెడ్డి, పోలవరపు జ్యోతి, వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటేశ్వరరావు, ఎం.సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, మాధవరావు, గోపి, పాల్, రాజేష్, పాల్గొన్నారు.

బీజేపీ మహిళ మోర్చా కమిటీ నియామకం

గుంటూరు మెడికల్: బీజేపీ మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు నద్ది నాగమల్లేశ్వరి అధ్యక్షతన శుక్రవారం గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సమావేశం జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, మహిళ మోర్చా జోనల్ ఇన్‌చార్జి చిగురుపాటి లక్ష్మి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, యడ్లపాటి స్వరూపారాణి, బొల్లాప్రగడ శ్రీదేవి, ఈదర శ్రీనివాస రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. నూతన మహిళ మోర్చా కమిటీని సమావేశంలో ప్రకటించారు. ఉపాధ్యక్షురాలిగా త్రిపురమల్లు వాణి, మౌనిక, సాధువాణి, నాగమల్లేశ్వరి, లక్ష్మి, విద్యారాణి, ప్రధాన కార్యదర్శులుగా కె.శ్రీకల్యాణి, లక్ష్మీప్రసన్న, కార్యదర్శులుగా పి.శ్రీలక్ష్మి, కె.రాణి, ఎస్.లక్ష్మీభవానీ, కె.నాగమల్లేశ్వరి, ఎస్.మహాలక్ష్మి, బిందు. కోశాధికారిగా డాక్టర్ శ్రవంతి, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా నీలిమలను నియమించారు.

మిరాకిల్స్ వరల్డ్ రికార్డ్స్‌కి పురుషోత్తమ్‌ప్రసాద్ ఎంపిక

నగరంపాలెం: మిరాకిల్స్ వరల్డ్ రికార్డ్స్‌కి సుభాంజలి కళావేదిక వ్యవస్థాపకుడు, గాయకుడు మేకల పురుషోత్తమ్ ప్రసాద్ ఎంపికయ్యారు. గతనెల 19న గుంటూరు అమరావతి రోడ్‌లోని అన్నదాన సమాజ ఆవరణలో 12 గంటల్లో 129 ఘంటసాల పాటలను ఆయన నిర్విరామంగా ఆలపించారు. దీనికిగాను ఆయన ఈ రికార్డ్‌ని సాధించారు. ఆయన ఎంపిక కావడంపై కళా సంస్థల ప్రతినిధులు, కళాభిమానులు అభినందనలు తెలిపారు.

సలాం.. జగన్ మామయ్యా

- ట్యాబ్స్ అందుకున్న విద్యార్థుల్లో ఆనందోత్సాహం
- ఎప్పటికీ జగన్ మామయ్యే సీఎంగా ఉండాలంటూ ఆకాంక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని జిల్లా పరీక్షా భవన్‌లో గురువారం జిల్లా విద్యాశాఖ-సమగ్రశిక్ష ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ చేసిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. రూ.33 వేల విలువ కలిగిన ట్యాబ్‌ను ఉచితంగా అందజేసిన సీఎం వైఎస్ జగన్‌కు ముక్త కంఠంతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన విద్యార్థులు జగన్ మావయ్యే ఎప్పటికీ సీఎంగా ఉండాలని ఆకాంక్షించారు. ట్యాబ్‌లు అందుకున్న ఆనందం వారి మాటల్లోనే....

జగన్ మావయ్యకు రుణ పడి ఉంటాం



మాది పేద కుటుంబం, నాన్న శ్రీను ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ ఇంటిని పోషిస్తున్నారు. గతంలో ఐదో తరగతి వరకు ప్రైవేటు పాఠశాలలో చదివించిన సమయంలో ఫీజులు చెల్లించేందుకు అమ్మానాన్న చాలా ఇబ్బందులు పడ్డారు. ఆరో తరగతి నుంచి ఇదే పాఠశాలలో చదువుతున్నా. ఇక్కడ వసతులు ఎంతో బాగున్నాయి. ఎంతో విలువైన ట్యాబ్‌ను ఉచితంగా అందజేసిన జగన్ మావయ్యకు రుణ పడి ఉంటాం.

–ఎ. చందన, విద్యార్థిని

చదువు విలువ తెలిసిన సీఎం జగన్ సార్



మాది మధ్య తరగతి కుటుంబం. నా భర్త దుర్గాసింగ్ ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నారు. మా కుమారుడిని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నాం. ప్రతి యేటా అమ్మ ఒడి అందుతోంది. విద్యాకానుక కిట్‌తో పాటు పాఠశాలలోనే గోరుముద్ద పెడుతున్నారు. ప్రస్తుతం వేలాది రూపాయల ఖర్చుతో ట్యాబ్‌ను ఉచితంగా ఇవ్వడం ద్వారా సీఎం జగన్ సార్ చదువుకు ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థమవుతోంది.

–తనయుడు శివలక్ష్మణ్‌తో తల్లి మీరాబాయ్

ట్యాబ్ అందుకుంటానని ఊహించలేదు



మా నాన్న నజీర్ బైక్ మెకానిక్. ప్రైవేటు స్కూల్లో చదివించేందుకు స్తోమత లేక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. అయితే ఇక్కడ ప్రైవేటు స్కూళ్ల కంటే ఎంతో మెరుగైన వసతులు ఉన్నాయి. సెల్‌ఫోన్ సైతం కొనలేని పరిస్థితుల్లో జగన్ మావయ్య ఇచ్చిన ట్యాబ్ అందుకోవడం ఎంతో గర్వంగా ఉంది. ఆయన ఆశయం మేరకు ఉన్నత విద్యావంతురాలిగా ఎదుగుతాను.

–షేక్ ఆఫ్రీన్, విద్యార్థిని

ట్యాబ్ అందుకోవడం ఆనందంగా ఉంది



నాన్న నసీరుద్దీన్ ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. పాఠశాలలో చదువుతున్నందుకు అమ్మఒడి ఇస్తున్న ప్రభుత్వం ట్యాబ్ ఉచితంగా ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు అన్నీ ఉచితంగా అందించడం గతంలో లేదు.

–షేక్ అష్ఫక్ అక్రమ్, విద్యార్థి

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకతను వెలికితీయవచ్చు



వివిధ రాష్ట్రాల వస్త్రధారణ విద్యార్థులతో భాష్యం రామకృష్ణ



సైన్స్ ప్రాజెక్టులను తిలకిస్తున్న సురేంద్రబాబు, విష్ణువర్ధన్, కృష్ణవేణి



ప్రాజెక్టులను తిలకిస్తున్న డైరెక్టర్ శ్రీకాంత్‌బాబు



సుమేధ స్కూల్లో ఆకట్టుకున్న గణితశాస్త్ర ప్రదర్శన

అప్లికేషన్స్ సెంటర్ సీనియర్ సైంటిస్ట్ కేఈ మోహిత్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో దాగిన సృజనాత్మతకను వెలికితీయవచ్చునని హర్యానా స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ సీనియర్ సైంటిస్ట్ కేఈ మోహిత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం భారతీయ గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా రింగ్‌రోడ్డులోని భాష్యం బ్లూమ్స్ వీబీసీ క్యాంపస్‌లో స్ట్రీమ్ ఎక్స్‌పో-2023 పేరుతో విద్యార్థులచే వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహిత్‌కుమార్ మాట్లాడుతూ భావి శాస్త్రవేత్తలను తయారు చేయడంలో ఇటువంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ప్రాజెక్టులను తిలకించి, వాటి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల మేధస్సు వికసిస్తుందని, తద్వారా ఉన్నతమైన ఫలితాలను సాధిస్తారని చెప్పారు. తొలుత శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో వస్త్రధారణతో అలరించారు. అదే విధంగా నగరంలోని భాష్యం విద్యాసంస్థల అన్ని క్యాంపస్‌లలో శ్రీనివాస రామానుజన్ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ జెడ్‌ఈవో వరలక్ష్మి, ప్రిన్సిపాల్ రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారామయ్య స్కూల్లో ఆకట్టుకున్న ఎడ్యు ఎక్స్‌పో

గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీ పాటిబండ్లసీతారామయ్య సీబీఎస్‌ఈ స్కూల్లో ఏర్పాటు చేసిన ఎడ్యు ఎక్స్‌పో విద్యార్థుల్లోని ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. గణితంతో పాటు భౌతిక, జీవ, రసాయన, సామాజిక, పర్యావరణ శాస్త్రాల సమాహారంగా విద్యార్థులు వందలాది ప్రాజెక్టులతో ఆకట్టుకున్నారు. విద్యా, వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక అంశాల సమాహారంగా వైవిధ్యమైన ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులు సందర్శకులకు వాటి విశేషాలను వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ప్రదర్శన ప్రారంభించిన డాక్టర్ కేఏల్పీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వై. రధినీ చౌదరి ప్రాజెక్టులను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ రామినేని సురేంద్ర బాబు ప్రాజెక్టులను తిలకించి, వాటి విశేషాలను తెలుసు కుని విద్యార్థుల్లోని ప్రతిభను మెచ్చుకున్నారు. నచ్చిన రంగంలో కృషి, పట్టుదలతో రాణించాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ గణిత ఆకృతులను పోలిన పాఠశాల సముదాయంతో పాటు మాథ్స్ మ్యూజియం, గోల్డెన్ రేషియో బటర్ ఫ్లై భౌతిక, రసాయన, గణిత, సామాజిక శాస్త్రాల వారీగా వందలాది ప్రాజెక్టులను తయారు చేసిన తమ పాఠశాల విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా నిలిచారన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మక నైపుణ్యాలను వెలికి తీయడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సహకారం మరువలేనిదన్నారు.

కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాద్ రావు, డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కెనడీ స్కూల్లో...

గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అరండల్‌పేటలోని కెనడీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మెరిట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన గణిత విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈసందర్భంగా విద్యార్థులు వివిధ రకాల మోడల్స్, పజిల్స్, ఫన్ గేమ్స్ ప్రాజెక్టుల ద్వారా గణితశాస్త్రంలో తమ ప్రావీణ్యతను చాటారు. పాఠశాల డైరెక్టర్ కె. శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, వ్యవస్థాపకురాలు సావిత్రి విద్యార్థుల్లోని ప్రతిభను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. ఐజాక్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుమేధ స్కూల్లో ఆకట్టుకున్న గణితశాస్త్ర ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో శుక్రవారం భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణితశాస్త్రంలో ఆయన సాధించిన విజయాలకు సంబంధించిన అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. వివిధ రకాల చార్టులు, నమూనాలను ప్రదర్శించడంతో పాటు నృత్యం, గానం ద్వారా చక్కగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము తయారు చేసిన ఫన్నీ మాథ్స్ పజిల్స్, మోడల్స్‌ను సందర్శకులకు వివరణాత్మకంగా తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్

- ఫిర్యాదులు, అర్జీల నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది
- కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో పని చేసే కార్మికులు సమస్యల పరిష్కారానికి ప్రతి వారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించాలని, గ్రీవెన్స్‌లో అందే ఫిర్యాదులు, అర్జీల నిర్వహణకు విభాగంలో సిబ్బందిని కేటాయించాలని డిప్యూటీ కమిషనర్, ఎంహెచ్‌ఓని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు వర్కర్స్ గ్రీవెన్స్ కమిషనర్ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విభాగాల వారీగా కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రతి వారం వర్కర్స్ గ్రీవెన్స్ నిర్వహించాలని, గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను, ఫిర్యాదులను నిర్దేశిత గడువు లోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రీవెన్స్ అర్జీల రికార్డ్ నిర్వహణకు విభాగంలో ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. మరణించిన కార్మికులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఎటువంటి అవినీతికి పాల్పడినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్మికులు తమకు అందే జీతాలు, ఇతర అలవెన్స్‌లకై ఎవ్వరికీ ఎటువంటి నగదు ఇవ్వాల్సిన పనిలేదని, ఎవరైనా నగదు డిమాండ్ చేస్తే ప్రతి శుక్రవారం జరిగే గ్రీవెన్స్‌లో నేరుగా తమ దృష్టికి తేవాలన్నారు. కార్మికుల పీఎఫ్‌లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌ని ఆదేశించారు. వార్డ్ సచివాలయాల వారీగా ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు తమ పరిధిలోని కార్మికులకు ఉన్న పీఎఫ్ సమస్యలపై రిపోర్ట్ ఇవ్వాలన్నారు. పీఎఫ్ సంబంధిత విధులపై కంప్యూటర్ ఆపరేటర్‌కి శిక్షణ ఇవ్వాలన్నారు. మరణించిన, 60 ఏళ్లు నిండిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను మానవతా దృక్పదంతో నియమించడానికి చర్యలు తీసుకుంటున్నామని, అందుకు అవసరమైన డాక్యుమెంట్స్ వివరాలు కార్మికులకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ కె.రవీంద్ర, ఎస్.ఈ. సుందరరామిరెడ్డి (ఎఫ్ఏసీ), ఎంహెచ్‌ఓ (ఎఫ్ఏసీ) మధుసూదన్, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల నుంచి అర్జీల స్వీకరణ

కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై వార్డుల వారీగా నివేదిక ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యల పై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వార్డుల వారీగా కార్పొరేటర్లు అందించిన అర్జీలు, వాటి పరిష్కారంపై నివేదిక ఇవ్వాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు కమిషనర్ తో చర్చించడానికి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా సమయం కేటాయించడం జరిగిందన్నారు. మిగిలిన రోజుల్లో కూడా కార్పొరేటర్లకు అందుబాటులో ఉంటామని, వాట్సప్‌లో సమస్యలు తెలిపినా కూడా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

నిర్దేశిత గడువు లోగా పనులు పూర్తి చేయాలి

నగరంలో టెండర్ పొందిన కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్ లో నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు నిర్వహించే కాంట్రాక్టర్ల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేశామన్నారు.

అంతర్గత డ్రెయిన్లు శుభ్రం చేయాలి

గుంటూరు నగరంలోని అంతర్గత డ్రెయిన్‌లలో పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని రేట్ పెయర్స్ అసోసియేషన్ సభ్యులు నగర కమిషనర్ కీర్తి చేకూరిని కోరారు. శుక్రవారం కమిటీ సభ్యులు కమిషనర్‌ని చాంబర్‌లో కలిసి డ్రైన్లలో పూడికతీత, తాగునీటి సరఫరా, అభివద్ధి పనుల పై చర్చించారు. సమావేశంలో ఎస్.ఈ.(ఎఫ్ఏసీ) సుందరారమిరెడ్డి, ఎంహెచ్‌ఓ (ఎఫ్ఏసి) మధుసూదన్, కమిటీ సభ్యులు పరంధామయ్య, జోగారావు, నారాయణ రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

ఉచిత మెడికల్ క్యాంపు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వై. షేక్, వైద్యులు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ డాక్టర్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై. షేక్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.షేక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్నా.. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ప్రతి ఏడాది చికిత్స చేయించుకునే అవకాశాన్ని కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విలేజ్ క్లినిక్, జగనన్న ఆరోగ్య సురక్షతో పాటు అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారన్నారు. సుమారు 100 మంది రోగులను వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, డాక్టర్స్ విభాగం నేతలు తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. కోవిడ్ ఫైటర్స్



గుంటూరు మెడికల్: గాయాలు పాలై రోడ్డు మీద వదిలి వేసిన వృద్ధుడిని శాశ్విత ఆశ్రయం కల్పించారు గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు. గుంటూరు నగరం గాయాలు పాలై రోడ్డు మీద వదిలి వేయగా గుంటూరు కోవిడ్ ఫైటర్స్ వృద్ధుడిని అక్కున చేర్చు కున్నారు. గోతలా స్వామి ఆశ్రమంలో వృద్ధుడిని చేర్పించినట్లు వారు చెప్పారు. ఎవరైనా వృద్ధులు, అనాధలు నిరాదరణ గురై రోడ్ల మీద ఉంటే తమకు సమాచారం అందించాలని కోరారు. సెల్ నంబర్లు 8143222456, 9397602553కు సమాచారం అందించాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అనారోగ్యం, అప్పుల బాధ తాళలేక మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐపీడీ కాలనీలో నివాసం ఉండే సోమ అరుణ్‌కుమార్ (48) డెకరేషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో వ్యాపారంలో అప్పులు కావడంతోపాటు, అనారోగ్య సమస్యలు తలెత్తడంతో మనస్తాపానికి గురైన అరుణ్ కుమార్ ఈనెల 21న ఇంటి నుండి డెకరేషన్ పనులు ఉన్నాయని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో శుక్రవారం కుటుంబ సభ్యులు అదే ప్రాంతంలోని గోడౌన్‌కు వెళ్లి చూడగా పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు పవన్ మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రైస్తవం ఒక జీవన విధానం

సెమీ క్రిస్మస్ వేడుకల్లో వీసీ



మాట్లాడుతున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉద్యోగులు, విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీ ఎదురుగా ఉన్న పాస్టరల్ ట్రైనింగ్ సెంటర్లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. వేడుకల్లో పాల్గొన్న వీసీ ఆచార్య పి. రాజశేఖర్ మాట్లాడుతూ 45 ఏళ్లుగా ఈ వేడుకలు జరుపుతున్నారన్నారు. ఈ వేడుకలు ప్రతీ ఏటా జరగాలనీ కుల, మత, వర్గాలకతీతంగా వేడుకల్లో యునివర్సిటీ కుటుంబం పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతగా మెలగాలన్నారు. క్రైస్తవ మతం ఒక జీవిత విధానం అన్నారు. సమాజాన్ని చదవాలని సూచించారు. పాస్టర్ పరిశుద్ధ రావు క్రిస్ మస్ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో రిజిస్టర్ ఆచార్య బి. కరుణ, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య, పీజీ పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య ఉదయ్ కుమార్, న్యాక్ డైరెక్టర్ ఆచార్య సంధ్య కోల్, డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్, ఇంజనీర్ కుమార్ రాజా, డెప్యూటీ ఇంజనీర్ కంకణాల సుబ్బారావు, వికాస అధ్యక్షుడు టి అనిల్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్లోబల్ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో

గుంటూరు మెడికల్: క్రీస్తు జననం సర్వజనానికి పర్వదినం అని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. స్థానిక కొత్తపేటలోని కింగ్‌డమ్ గాస్పల్ చర్చిలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలకు డీఎంహెచ్‌ఓ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బిషప్ కొలగాని శ్యామ్‌సన్ రాబర్ట్, రెవరెండ్ కే.రాజకుమారి ప్రపంచ శాంతిగురించి ప్రత్యేక ప్రార్థనలు చేసి బైబిల్ సందేశాన్ని వివరించారు. గ్లోబల్ డయాగ్నస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట లక్ష్మణ్ ఏర్పాటు చేసిన కేక్‌ను డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు కట్ చేశారు. కార్యక్రమంలో గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్, గుంటూరు జిల్లా ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి, రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈరి రాజశేఖర్, ఏపీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మేడిద బాబురావు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో..

గుంటూరు మెడికల్ : ప్రభుత్వ ఆసుపత్రి మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, అసోసియేషన్ నేతలు ఎం. జ్యోతి బాబు, డి సాంబశివరావు, బోట్టు శ్రీను, ఏడి పాల్ సుధాకర్, ఏఓ పి.శ్రీనివాస్, మేనేజర్ మురళి, విజయ కుమార్ అకౌంటెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

బిల్లు ప్రవేశపెట్టాలి

నెహ్రూనగర్: పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబుమాదిగ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ మద్దతుగా ప్రధాని మోదీ ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, ఈ విషయంలో బీజేపీ చొరవ తీసుకుని వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు.

అసామాన్యుడు పీవీ నరసింహారావు

లక్ష్మీపురం: సంక్షోభ సమయంలో సరళీకరణ విధానాలను అవలంబించి దేశ ఆర్థిక వ్యవస్థను ఒడ్డుకు చేర్చిన అసామాన్యుడు పి.వి నరసింహారావు అని ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానులు హరి, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధాని పి.వి నరసింహా రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి ప్రసంగించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పాటతో పోరాటాలు

నగరంపాలెం: ప్రజా వ్యతిరేక విధానాలపై 'పాట' తన పోరాటాన్ని చేస్తుందని ఇఫ్టా జాతీయ కార్యదర్శి గని అన్నారు. విశాలాంధ్ర 23వ పుస్తక మహోత్సవంలో భాగంగా లాడ్జిసెంటర్ ఏఎల్‌బీఈడీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం అభ్యుదయ గీతాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అరసం కార్యవర్గ సభ్యులు ఎంవీఎస్‌ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ మురకొండ మల్లిఖార్జునరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానికి బీజేపీ నేతల ధన్యవాదాలు

గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లో ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం నిర్వహించారు. 70 సంవత్సరాల భారత దేశ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధాని నరేంద్రమోదీ 67,802 సీట్లు కేవలం తొమ్మిదేళ్ల కాలంలో కేటాయించినట్లు నరేంద్ర కుమార్ తెలిపారు. ఏపీకి నూతనంగా 17 మెడికల్ కాలేజీలను కేటాయించారన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు పీజీ సీట్లు ఇవ్వడంతోపాటు, నూతన పరికరాలు సైతం మంజూరు చేశారని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు నద్ది నాగమల్లేశ్వరి, జనరల్ సెక్రటరీలు కుమార్‌గౌడ్, తిరుపతిరావు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

My client, Powertek Industries, Guntur had decided to Purchase Semi Dry Land from Chanti Balamma, W/o. Chanti Ankala Reddy, R/o. D.No. 4-8-101, Karanam Gari Veedhi, Redla Bazar, Koratepadu, Amaravati Road, Guntur, Guntur District, A.P. admeasuring Ac. 1.26 cents or 0.509 hectares and mentioned in the below schedule.

SCHEDULE OF PROPERTY

ALL THAT Piece and Parcel of Land situated in Guntur Division, Nallapadu Sub Division, Pedapalakaluru Gram Panchayathi area, Pedapalakaluru Village in D.Nos. 239-A1, 242-A1A, 242-A1C an extent of Ac 1.26 cents or 0.509 hectares of Semi Dry Land is bounded thus. **East:** Land of OnteddluKotireddy; **South:** Land of Karasani Balireddy; **West:** Road leading to Koteswara Rao Memorial School; **North:** Land of Mangala Sambireddy & others.

Within these boundaries an extent of Ac1.26 cents or 0.509 hectares of Semi Dry Land. Any objections regarding this property can be conveyed within 7 days from the date of this notice to **K.SNEHALATHA, Advocate, 16-1-85, 2nd Lane, Navabharath Nagar, Ring Road, Guntur 522006. ✆. 9703947567.**

Dated 23.12.2023, Guntur